# సినీ నిర్మాత దుష్యంత్‌రెడ్డి హఠాన్మరణం



**షాద్‌నగర్ టౌన్, నవంబరు 12, ప్రభాతవార్త :** రియల్ ఎస్టేట్ రంగంలో పేరు తెచ్చుకున్నాడు, రైతులకు ఆదర్శంగా ఆర్గానిక్ రంగంలో పేరు పొందారు. తనకున్న పరిచయాలతో అనతి కాలంలోనే ప్రముఖ దర్శకుడు శశి ప్రీతంతో కలిసి ఎక్స్ రోడ్స్ సినిమాలో సహనిర్మాతగా వ్యవహరించారు. ఆ సినిమాలో ఓ పాత్రలో కూడా ఆయన పోషించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రాంతానికి చెందిన నిర్మాత ప్రముఖ వ్యాపారి దుష్యంత్ రెడ్డి అలియాస్ రిషి గుండెపోటుతో ఆకస్మిక మృతికి గురయ్యారు. అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మరణించినట్లు సన్నిహితులు తెలిపారు. షాద్ నగర్ లో వ్యాపార పరంగా లావణ్య బార్ తదితర వ్యాపార సంస్థలలో ఆయన భాగస్వామిగా ఉన్నారు. అదేవిధంగా ఆయన భార్య సాఫ్ట్వేర్ ఉద్యోగిని ఒక కుమారుడు ఒక కూతురు కూడా ఆయనకు ఉన్నారు. చంద్రాయనగూడ వద్ద ఆయనకు ఫామ్ హౌస్ ఉంది. ఇక్కడే రిషి అంతక్రియలు జరుపనున్నట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. పట్టణానికి చెందిన బిందు సురేందర్ రెడ్డి అలియాస్ బందిబాబుకు రిషి చాలా దగ్గర బంధువు. ప్రస్తుతం ఋషి పార్థివ దేహం అపోలో ఆసుపత్రిలో ఉంది. మిగతా 2లో

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# వాయుగండంతో దడ

## కోతల దశలో వరి పైర్లు - వాతావరణ మార్పులతో రైతుల బెంబేలు

## యంత్రాల సాయంతో కోతలు ముమ్మరం

**ధారూరు, నవంబరు 12 ప్రభాతవార్త:** ధారూర్ మండల వ్యాప్తంగా వరికోతలు సాగుతున్నాయి. కొన్ని రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పులతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షం రాకముందే రైతులు వరికోత యంత్రాల వెంట పరుగులు తీస్తున్నారు. మండల వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో 5,560 ఎకరాల్లో వరి పంట ను సాగు చేశారు. కోతకు వచ్చిన పంట ను కోసేందుకు రైతులు బిజీ అయ్యారు. వరి కోత మిష న్లు సైతం గ్రామాల్లోని పంట పొలాలకు చేరుకున్నాయి. ఇప్పటి వరకు 20 శాతం వరికోతలు పూర్తికావడం జరిగింది. రైతులు ధాన్యాన్ని కొ నుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ఆరబెడుతున్నారు.



యంత్రం సహాయంతో కోత కోస్తున్న దృశ్యం



# చిన్నారుల చెంత

# యమపాశం!

వికారాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త : ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ శాఖ సిబ్బందిలో నిర్లక్ష్యం వీడటం లేదు. ఎప్పటికప్పుడు సంబంధిత ఉన్నతాధికారులు సమీక్షా సమావేశాల్లో హెచ్చరిస్తున్న.. వారి ఆదేశాలు క్షేత్రస్థాయిలో వెనువెంటనే అమలు జరగటంలేదు.

- రక్షణ కంచె లేకుండా పాఠశాల ప్రహరీని ఆనుకుని ట్రాన్స్‌ఫారమ్
- విద్యుత్ వైరు తగిలి మూడోతరగతి విద్యార్థికి తీవ్ర షాక్
- అపస్మారక స్థితికి చేరుకున్న బాలుడు
- ఆస్పత్రికి తరలింపు-పరిస్థితి విషమం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి వంశీ

వికారాబాద్ మున్సిపల్ పరిధిలో బుధవారం చోటుచేసుకున్న ప్రమాదం అధికారుల ఉదాసీనతకు అద్దం పడుతోంది. వివరాల్లోకి వెళితే.. గంగారం ప్రాథమిక పాఠశాల మూడవ తరగతి చదువుతున్న వంశీ మధ్యాహ్న సమయంలో భోజనం చేయడానికి పాఠశాల బయటకు వస్తున్నాడు. ఆ సమయంలో పాఠశాల ప్రహరీ గోడకు ఆ నుకుని ఉన్న 33 కెవి ట్రాన్స్ ఫారం వైర్లు తగిలి విద్యుత్ షాక్‌తో కుప్పకూలిపోయాడు. అపస్మారక స్థితికి చేరుకున్న విద్యార్థిని ఉపాధ్యాయులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సరైన చికిత్స అందుబాటులో లేకపోవడంతో స్థానికంగా ఉన్న ఈషా ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో నగరంలోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఎలాంటి రక్షణ వలయం లేకుండా 33 కె.వి ట్రాన్స్ ఫారం ఏర్పాటు చేయటం వలన ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు మండిపడుతున్నారు.

# కుక్కల రాజ్యం

## శాశ్వత కట్టడిపై కొరవడిన చిత్తశుద్ధి

### ఒక చోట పట్టుకుని మరో చోట వదులుతున్న వైనం

### నాగులపల్లిలో మూడేళ్ల బాలుడిపై విరుచుకుపడిన కుక్కల గుంపు

### ఎడమ కంటికి తీవ్ర గాయాలు- చూపు పోయిందని డాక్టర్లు నిర్ధారణ

### అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం



కుక్కలు బాబోయ్ వీధి కుక్కలు..ఎక్కడ చూడు రణరంగమే.. కుక్కల గోలతో సతమతం.. వీధిలో కాలు పెడితే భయం భయం.. ఎక్కడ పిక్క పీకుతోందో అన్న అనుమానం..బౌ బౌ శబ్దమే నేడు జనానికి శాపం.. కర్ణ కఠోర అరుపులే మృత్యు కేళిలవుతున్నాయి. గ్రామ సింహాలు చేస్తున్న హడావిడి అంతా ఇంతా కాదు. నర మాంసం రుచి మరిగిన శునకాలు ఏ ఒక్కరు దొరికినా తాటతీస్తున్నాయి. నడిరోడ్డుపై పిల్లల్ని పంపాలంటే భయపడాల్సిన పరిస్థితి వస్తోంది. ఏ దిక్కు నుంచి వస్తుందో అపాయం అని తల్లిదండ్రులు ఒణికిపోతున్నారు.

కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి





**షాద్‌నగర్ టౌన్, నవంబరు 12, ప్రభాతవార్త :** గ్రామ సింహాలు బారి నుంచి కాపాడాలని ఎంతమంది మొత్తు కున్నా.. న్యాయస్థానాలు ఆదేశించినా.. అధికారులకు చలనం ఉండటం లేదు. ఈ మధ్య కాలంలో ఎక్కడ చూసినా వీధి కుక్కలు పెరిగిపోతున్నాయి. దీంతో పిల్లలు, పెద్దల మీదకు ఎగబడిపోతున్నాయి. విపరీతంగా కరుస్తున్నాయి. ఇలా కుక్కకాటు బలవుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. అయితే అవి కరవడం వల్ల వచ్చే రాబిస్ వ్యాధి మాత్రమే కాదు పలు రకాల జబ్బులకు గురి అయ్యే ప్రమాదం ఉందని వైద్య శాఖ చెబుతోంది. పెద్ద మొత్తంలో వీధి కుక్కలు తిరుగుతుండడంతో ఎప్పుడు ఏ క్షణాన్న ప్రజలపై దాడికి దిగుతున్నాయో తెలియడం లేదు. కొంతమంది వీధికుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోతుంటే మరికొంతమంది తీవ్ర గాయాలై హాస్పిటల్ పాలవుతున్నారు. ఫరూఖ్ నగర్ మండల పరిధిలో నాగులపల్లి గ్రామంలో ఓ చిన్నారిపై వీధి కుక్కల కాటుకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే .. జనార్ధన్ జ్యోతి దంపతుల కుమారుడు రీత్విక్ (3) ఇంట్లో ఆడుకుంటూ బయటకు రావడంతో ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. బాలుడు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి కుక్కలను తరిమికొట్టారు. ఈ ఘటనలో చిన్నారి ఎడమ కన్నుకు తీవ్రంగా గాయమైంది. హుటాహుటిన షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి హైదరాబాద్ సరోజినీ కంటి ఆసుపత్రికి తరలించారు. బాలుడి వైద్య పరీక్షలు చేయగా ఎడమ కన్ను పూర్తిగా కోల్పోయాడని సరోజనీ వైద్యులు నిర్ధారించి తగిన శస్త్రచికిత్స చేశారు. జరిగిన దారుణానికి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

వేరొక చోటు నుండి కుక్కలను పట్టుకొచ్చి తమ గ్రామంలో వందల సంఖ్యలో కుక్కలను వదిలిపెట్టారని గ్రామస్తులు తెలిపారు. చిన్నారులు ఒంటరిగా ఉంటే కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని వివరించారు. వీధి కుక్కలని కట్టడి చేయటం తలకు మించిన భారంగా మారిందని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా తక్షణం ఇక్కడి నుంచి సునకాలను తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

# శాఖల మధ్య సమన్వయ లోపం

# ప్రయాణికులకు శాపం

## రహదారులకు అడ్డంకిగా మారిన ఫారెస్ట్ చట్టాలు

### క్లియరెన్స్‌కు ఏళ్లతరబడి నిరీక్షణ

### ముందుకు సాగలేక పనులు డీలా

### చొరవ చూపించని అధికార యంత్రాంగం

**(ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి)**

అటవీ చట్టాలు రహదారుల విస్తరణకు ప్రతిబంధకంగా మారాయి. ఆర్అండ్‌బీ, పంచాయత్‌రాజ్ రోడ్ల నిర్మాణానికి అనేక అడ్డంకులు ఎదరవుతున్నాయి. ఫారెస్ట్ పరిధిలో ఇది వరకే నిర్మించిన రోడ్లను విస్తరించాలన్నా కుదరడం లేదు. అంతెందుకు రోడ్లకు అడ్డంగా ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించాలన్నా అధికారులు కన్నెర్ర జేస్తున్నారు. ప్రభుత్వశాఖల మధ్య సమన్వయలోపం వల్ల ప్రయాణికులకు శాపంగా మారింది. ఫలితంగా మొండికేసిన రోడ్లు ఏళ్ల తరబడి దర్శనమిస్తున్నాయి. ఈ రహదారులకు గ్రహణం..జిల్లాలో వికారాబాద్ పరిసరాల్లో అనంతగిరి చుట్టూ రోడ్డు విస్తరణకు చట్టాలు అడ్డుపడ్డాయి. ప్రమాదకరంగా మారిన ఘాట్ రోడ్డులో కూడా పనులు చేపట్టేందుకు ససేమిరా అంటున్నారు. యేడాది క్రితం కలెక్టర్ ప్రతీక్‌జైన్ చొరవ చూపడంతో కేరెల్లి నుంచి వికారాబాద్ వెళ్లే రహదారిలో అనంతగిరి రెండోఘాట్, మూడోఘాట్ వద్ద కొంతవరకు విస్తరించారు. ఇది చాలా సౌకర్యవంతంగా మారిందని వాహనదారులు అంటున్నారు. మూడోఘాట్ మలుపు వద్ద మరింత విస్తరించాలని కోరుతున్నారు. దాంతో పాటు హరిత రీసార్టు నుంచి వికారాబాద్ వెళ్లే వన్‌వే విస్తరణ కూడా చేపట్టాల్సి ఉన్నది. ఈ సింగిల్ రోడ్డును విస్తరిం చాలని ఇరవై ఏండ్లుగ ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోయింది. అనంతగిరి నుంచి బండబావి ఆంజనేయస్వామి



పెద్దేముల్ మండలంలోని అటవీ పరిధిలో నిలిచిపోయిన రోడ్లు

ఆలయం మార్గం కూడా మరింత విస్తరిం చాల్సి ఉన్నది. ఇవి కాకుండా తాండూరు నుంచి తొర్మామిడి, జినుగుర్తి నుంచి అడ్కిచర్ల రహదారులకూ ఫారెస్ట్ చట్టాలు అడ్డుగా ఉన్నాయి. ఆ శాఖ అనుమతులు నిరాకరించడం వల్ల పనులు ముందుకు సాగడం లేదు. కొంతదూరం వ న ు ల ు



పూర్తి చేసినా అటవీ హద్దుల్లో నిలిచిపోయాయి. బషీరాబాద్ మండలం ఏకాంబరి నుంచి మైల్వార్ వరకు కూడా రహదారి విస్తరించాల్సి ఉన్నది. ప్రమాదకరంగా మారిన అటవీ ప్రాంత రహదారులకు మోక్షం కల్పించాలని ప్రజలు కోరుతున్నా ప్రయోజనం లేకపోయింది. కేంద్ర, రాష్ట్రాల పరిధిలో ఉండే అటవీభూముల మీదుగా ప్రజాప్రయోజనా దృష్ట్యా ఉన్నతాధికారులు సానుకూలంగా వ్యవహరిం చాలని అంటున్నారు.

**నిబంధనలేమంటున్నాయంటే..**

అటవీ ప్రాంతంలో కొత్త రోడ్డు నిర్మించాలన్నా, పాత రోడ్డు విస్తరణ చేపట్టాలన్నా పలు నిబంధనలు ఉన్నాయి. ఈ పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ముందస్తు ఆమోదం పొందిన తర్వాతనే పనులు ప్రారంభించాలి. పర్యావరణంపై చూపే ప్రభావంపై అంచనాలు వేయాలి. కేంద్రం ఆమోదం పొందిన తర్వాత ప్రత్యామ్నాయ భూమిని అటవీశాఖకు అప్పగించాలి. అంతేకాకుండా పరిహారం కూడా చెల్లించాలంట. ఈ నిబంధనలు అటవీ సంరక్షణ చట్టం 1980 పరిధిలోకి వస్తాయి. ఎలాంటి అనుమతి లేకుండా అటవీభూములను వాడకూడదని, ఇది చట్టవిరద్ధమని స్పష్టం చేస్తున్నారు. అనుమతి ప్రక్రియలో జాప్యం మిగతా 2లో



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి. ఫొటోలో అదనపు కలెక్టర్ రాధికగుప్తా తదితరులు

# పండుటాకులకు కాస్తంత భరోసా

### ఆరోగ్యం, భద్రత, సామాజిక అంశాలపై ప్రోత్సాహం

### వారంపాటు జిల్లా వ్యాప్తంగా అవగాహన శిబిరాలు

# గ్రానైట్ రాయితో దారుణ హత్య

### టైల్స్ వర్కర్ల మధ్య పని విషయంలో తరచు గొడవలు

### మాట లెక్కచేయటం లేదని ప్రతీకారంతో రగిలిన గంగా ప్రసాద్

### అర్ధరాత్రి నిద్రిస్తుండగా మద్యం మత్తులో తోటి కార్మికునిపై దాడి

**కొత్తూరు, నవంబరు 12, ప్రభాతవార్త:** కొత్తూరు పట్టణంలోని బండారీ వింటేజ్ వెంచర్‌లో పని చేస్తున్న ఇద్దరు కార్మికుల మధ్య జరిగిన పని గొడవ దారుణ హత్యగా మారింది. హత్య కేసును చేదించిన పోలీసులు పోలీసులను ఇన్స్పెక్టర్ నర్సయ్య అభినందించారు. గత సోమవారం హత్యకు గురైన ఎండి సదాఫ్ హత్యపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎం.డి. సదాఫ్ 31, వృత్తి టైల్స్ వర్కర్, నివాసం కొత్తూరు, స్వస్థలం బీహార్ రాష్ట్రంలోని మేధేపుర జిల్లా. అతని సద్దకుడు ఎం.డి. సంశూల్ (31), అదే ప్రాంతానికి చెందినవాడు. వీరిద్దరూ కొత్తూరులోని ప్లాట్ నెం.41, సర్వే నంబర్లు 44/1, 44/2 45 వద్ద ఉన్న బండారీ వింటేజ్ క్లాసికా అనే నిర్మాణంలో టైల్స్ పనులు చేస్తూ, పై అంతస్తులో వేర్వేరు గదుల్లో నివసిస్తున్నారు. అదే బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో గంగా ప్రసాద్ బాఘెల్ (33), వృత్తి సిమెంట్ ప్లాస్టరింగ్ వర్కర్, స్వస్థలం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, తన కుటుంబంతో కలిసి నివసిస్తూ అక్కడే పనులు చేసేవాడు. గంగా ప్రసాద్‌కి, యం.డి. సంశూల్‌కి మధ్య పనుల విషయంలో తరచుగా మాటామాటా జరిగేది. నవంబర్ 10న ఉదయం 11 గంటల సమయంలో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆ సమయంలో గంగా ప్రసాద్ ఎన్ని సార్లు చెప్పినా వినట్లేదు, నీ తల పగలకొడతా అని హెచ్చరించినట్లు సాక్షులు తెలిపారు. రాత్రి సమయంలో మద్యం సేవించిన గంగా ప్రసాద్, పాత గొడవ గుర్తుకు తెచ్చుకొని ప్రతీకార భావంతో అర్ధరాత్రి 1 గంట సమయంలో పై అంతస్తులోని కిచెన్‌లో నిద్రిస్తున్న యం.డి. సంశూల్‌పై గ్రానైట్ రాయితో తలపై బలంగా కొట్టి చంపినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు గంగా ప్రసాద్ నవంబర్ 12 ఉదయం పెంజర్ల మిగతా 2లో



కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

# ఏ గ్రేడ్‌కు రూ.2,389 ఇస్తాం

### సన్న రకానికి అదనంగా రూ.500 బోనస్

### ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ ప్రతీక్ జైన్ దిశానిర్దేశం

### కేంద్రాల వద్ద రైతులకు ఏ ఇబ్బందీ రాకూడదని ఆదేశం

**కొడంగల్, నవంబరు 12 ప్రభాతవార్త :** రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలంలోని కొత్తూరు, నాగిరెడ్డిపల్లిలోని వరి కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రారంబించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరను అందిస్తూ ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 చొప్పున కనీస మద్దతు ధర చెల్లిండంతో పాటు సన్న రకానికి అదనంగా రూ.500 చొప్పున బోనస్ అందించనుందన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గన్నీ బ్యాగులు, తూకం యంత్రాలు, టార్పాలిన్‌లు, తేమ కొలిచే యంత్రాలను అందుబాటులో సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు. తాగునీరు, నీడ వసతి నిమిత్తం టెంట్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎక్కవ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకొని ధాన్యం తూకం జరిగేలా ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు రవాణా జరిగేలా సరిపడా లారీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం నాగిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించుకున్న ఇళ్ళను పరిశీలించి, ఇళ్లు నిర్మించుకొని గృహప్రవేశాలు చేసుకున్న కుటుంబాలకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి, అడిషనల్ డీఆర్డీఓ నరసింహులు, డిసీఎస్ఓ సుదర్శన్, డీఎంసిఎస్ మోహన్ కృష్ణ, తహశీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ వెంకన్నగౌడ్‌లతో పాటు సంభందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

# వచ్చే మార్చికి అమృత్ భారత్ !

### వేగవంతంగా పనులు పూర్తిచేయడమే లక్ష్యం..

### సికింద్రాబాద్ డిఆర్ఎం గోపాలకృష్ణన్

**తాండూరు, నవంబరు 12, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ కింద తాండూరులో చేపడుతున్న రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయడం జరుగుతుందని, వచ్చే ఏడాది మార్చిలోపు పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా ముందకు సాగుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ డీఆర్ఎం డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆద్వర్యంలో రూ.24కోట్ల నిధులతో తాండూరు రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. బుధవారం తాండూరు రైల్వేస్టేషన్‌ను డీఆర్ఎం గోపాలకృష్ణన్ రైల్వే అధికారులతో కలిసి సందర్శించారు. అమృత్ భారత్ కింత చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మిగతా 2లో



తాండూరు రైల్వే స్టేషన్‌ను సదర్శిస్తున్న డిఆర్ఎం ఆర్. గోపాలకృష్ణన్

## ఆరోగ్య రక్షణపై విద్యార్థులకు అవగాహన

**పాఠశాలల ప్రధానోపాధ్యాయులు**

**పూడూరు, నవంబరు 12, ప్రభాతవార్త :** ప్రతిఒక్కరూ ఆరోగ్యాలను కాపాడుకునే విధంగా తగు చర్యలు తీసుకోవాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజు,మధులు పేర్కొన్నారు.బుధవారం పూడూరు మండలపరిధిలోని కడ్మూరు జిల్లా పరిషత్తు ఉన్నత,మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలల్లో ఆశ్రయ ఆకృతి,క్వాల్కమ్ కళాబృందం వారు నటరాజ్ కల్చరల్ మీడియా అధ్వర్యంలో ఆరోగ్య రక్షణపై ఆట,పాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాల్గొన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్య అభ్యాసనకోసం చెవి,కన్ను,గొంతు వంటి సన్నితమైన అవయవాలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.పిల్లలు సెల్‌ఫోన్,టివి,డిజెలకు దూరంగా ఉండాలని సూచిం చారు.చెవిలో పిన్ని,ఇనుప చువ్వలు వంటివి పెట్టుకోరాదన్నారు.మాటకన్నా పాట రూపంలో ఆరోగ్యాన్ని ఏవిధంగా కాపాడుకోవాలో వివరించిన కళాబృందాన్ని అభినందించారు.ఆకృతి సంస్థ అధ్వర్యంలో విద్యార్థులకు వారం రోజుల్లో చెవి,ముక్కు ,గొంతుకు సంబంధించిన ఉచిత పరీక్షలు నిర్వహించి చికిత్స,మందులకయ్యే రూ.10 లక్షలవరకు ఖర్చులను భరించడం అభినందనీయమన్నారు.ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయులు సువానయ్య,హరీష్,కళాబృంధం సభ్యులు లింగస్వామి ,శంకర్,బాబు,అశోక్,కోఆర్డీనేటర్ నరేందర్,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పూడూరు మండలం కడ్మూరు పాఠశాలలో ఆరోగ్య రక్షణపై జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం మధు,కళాబృంధం తదితరులు

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

**జిల్లేడు చౌదరి గూడ,నవంబరు 12, ప్రభాతవార్త :** జిల్లేడు చౌదరిగూడ మండలంలోని ఎదిర ప్రభుత్వ పాఠశాలలో బుధవారం బిజెపి మండల అధ్యక్షుడు ఏదిర రాజు విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు ట్రస్ట్ అధినేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సహకారంతో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు బాగా చదివి తమ తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న బిజెపి మండల అధ్యక్షుడు ఎదిర రాజు

రైతు ఖాతాలో డబ్బులు త్వరగా

## జమ అయ్యేటట్లు చూడండి

**మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు**

**కుల్కచర్ల,నవంబరు 12, ప్రభాతవార్త :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మొక్కజొన్న ధాన్యం కొనుగోలు చేయాలని మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం రైతులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..మొక్కజొన్న రైతులకు ముఖ్యంగా గన్నిబ్యాగుల అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రైతు ఖాతాలో డబ్బులు త్వరగా జమ అయ్యేటట్లు ఆన్లైన్లో నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు.


మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఛైర్మన్ ఆంజనేయులు

## ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోండి

**కురుమ సత్తయ్య గురునాథ్ రెడ్డి**

**యాచారం, నవంబరు 12 ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని చింతపట్ల నందివనపర్తి యాచారం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపిడిఒ రాధా రాణి, పిఎసిఎస్ జిల్లా చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య , ఇబ్రహీంపట్నం ఏఎంసి చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, బిలకంటి చంద్రశేఖర్ రెడ్డిలు కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుకు మద్దతు ధర అందిస్తుందని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారుల చేతుల్లో రైతులు మోసపోరాదని గ్రేడ్ 1 గ్రేడ్ 2 ప్రభుత్వం ధాన్యానికి సరియైన మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవినాథ్, ఏఎంసీ డైరెక్టర్లు మస్క నరసింహ, అక్బర్, గ్రామ కార్యదర్శులు శ్రీనివాస్, రవీకుమార్ రెడ్డి, నాయకులు జోగి రెడ్డి,నెర్రే శ్రీశైలం, గోరేటి వెంకటేశం, ముచ్చర్ల యాదగిరి, బండి అలెగ్జాండర్, చాలా పంది సుధాకర్, మల్లేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం

**యాచారం, నవంబరు 12 ప్రభాతవార్త :** యాచారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాధా రాణి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. మండల విద్యాధికారి, హౌసింగ్ అధికారుల తో కలిసి గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సంద ర్భంగా మండలంలో పెండింగ్లో ఉన్న ఇందిరాఇల్ల బిల్లులను త్వరితగతిగా చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు. మండలంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు పై ఎంఈఓతో విషయాలను అడిగి తెలుసుకున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాధారాణి


నందిగామ అయ్యప్ప దేవాలయంలో మాల ధరించిన అయ్యప్ప భక్తులు

## మాల ధారణం.. నియమాల తోరణం

**నందిగామ, నవంబరు 12 ప్రభాతవార్త :** నందిగామ మండలం సిడి తండా మాజీ సర్పంచ్ జటావత్ రాజునాయక్ బుధవారం గురు స్వామి గిరీష్ నాయర్ చేతుల మీదుగా18 సారి అయ్యప్ప మాల ధరించాడు. ఈ సందర్భంగా గిరీష్ నాయర్ గురుస్వామి కొబ్బరి మొక్కను రాజు నాయక్‌కు బహూకరించారు. తాటిగడ్డ తండా, సిడి తాండ ల నుండి 14 మంది స్వాములు మాల ధరించినట్లు జటావత్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. మాల ధరించిన వారిలో బిచ్చ నాయక్, జటావత్ శ్రీను నాయక్,గోవింద్ నాయక్ తదితరులు ఉన్నారు.

# డ్రగ్స్‌కు వ్యతిరేకంగా గళమెత్తిన విద్యార్థులు


ఆమనగల్లులో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

**ఆమనగల్లు, నవంబరు12, ప్రభాతవార్త:** యువత సన్మార్గాన్ని అనుసరించి ముందుకు సాగాలని, మత్తుపదార్థాలకు బానిసలుగా మారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని ఎక్సైజ్‌శాఖ సిఐ బద్యనాథ్ చౌహాన్ అన్నారు. నిషేధిత డ్రగ్స్ వినియోగంతో ఎన్నో జీవితాలు ఛింద్రం అవుతున్నాయని ఆయన ఉద్ఘాటించారు. ఆమనగల్లు మండల కేంద్రంలో బుధవారం తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టిఎస్‌ఎస్‌ఓ) ఆధ్వర్యంలో డ్రగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు సదస్సుకు హాజరైన్నారు. కార్యక్రమానికి ఎక్సైజ్‌శాఖ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఆశాఖ సిఐ బద్యనాథ్‌చౌహాన్‌తోపాటు ఎస్సై, సిబ్బంది హాజరైనారు. ఈసందర్భంగా పట్టణంలోని జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వినియోగంతో ఎదురయ్యే అనార్థాలను సిఐ వివరించారు. జీవితంలో ఉన్నత స్థితిని అధిరోహించాలంటే చిన్నతనం నుండే సక్రమ మర్గాన్ని ఎంచుకోవాలన్నారు. మత్తుపదార్థాలు పట్ల యువత అప్రమత్తతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు

# రావిర్యాలలో కార్తీక వన మహోత్సవం

**జిల్లేడు చౌదరి గూడెం, నవంబరు12, ప్రభాతవార్త:** జిల్లేడు చౌదరిగూడ మండలంలోని రావిర్యా ల గ్రామంలో బుధవారం కార్తీక మాస వన మహోత్సవ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ శివారులో గల ఉసిరి చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడే వంటలు చేసుకుని వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు తదితరులు

వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు



## అదృశ్యమైన వృద్ధుడి అస్థిపంజరం లభ్యం

**మర్పల్లి , నవంబరు12, ప్రభాతవార్త:** మర్పల్లి మండలంలోని బూచన్‌పల్లి గ్రామానికి చెందిన చాపల లక్ష్మయ్య (80)అనే వృద్ధుడు గత నెల 21 ఇంటి నుండి కనపడకుండా పోయాడు.కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకి దొరకగా పోగా మంగళవారము గ్రామ పొలిమేరలోని ఒ కందిచేలో అస్థి పంజరాలు కనిపించగా చెప్పులు ,దుస్తులు గుర్తించి అవి లక్ష్మయ్యకు చెందినవే అంటూ కుటుంబ సభ్యులు గుర్తించారు.సమాచారం తెలుసుకున్న పోలీసులు అనుమానస్పదంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి

**ఘట్‌కేసర్ రూరల్, నవంబరు12, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన మోటార్‌బైకిస్టు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటన వివరాలు స్థానిక పోలీసులు తెలిపిన కథనం ప్రకారం ఇలా ఉన్నాయి.

పోచారం మున్సిపల్ కొర్రెముల గ్రామంలోని గ్రీన్ ల్యాండ్ అపార్టుమెంటులో ఎ. శ్రీనిధి ( 32 ) తన భార్య కూతురుతో కలిసి నివాసం ఉంటున్నాడు. తన భార్య సుభాషిణి కూతురుతో కలిసి వరంగల్‌లోని తల్లిగారింటికి వెళ్లింది. ఈ నెల 8 వతేదిన మృతుడు శ్రీనిధి తన నివాసం నుండి డ్యూటీ నిమిత్తం మోటార్‌సైకిలుపై వెళ్లుచుండగా కొర్రెముల కమాన్ వద్ద ఆకస్మాత్తుగా గేదే అడ్డం రాగా మోటార్‌సైకిలు ఢీ కొట్టింది. దీంతో మోటార్‌సైకిలిస్టు శ్రీనిధి తలకు తీవ్రంగా గాయాలైనాయి. దీంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఉప్పల్‌లోని శ్రీకర్ ఆస్పత్రికి అక్కడి నుండి మలక్‌పేట్‌లోని యశోద ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడి నుండి ఈ నెల పదవ తేదిన నిమ్స్ ఆస్పత్రికి తరలించగా ఈ నెల 11 వ తేదిన చికిత్స పొందుతూ బాధితుడు శ్రీనిధి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య సుభాషిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంబంధిత ఎస్సై. ఎ. కృష్ణయ్య తెలిపారు.

# అందుబాటులోకి కొనుగోలు కేంద్రాలు

## ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదే
## -ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి-డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్త

**ఆమనగల్లు, నవంబరు12, ప్రభాతవార్త:** రైతుకు గిట్టుబాటు ధర అందించాలనే ఆశయంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ అన్నారు. దళారులను ఆశ్రయించి రైతులు మోసపోకూడదని, పండించిన ప్రతి గింజ ధాన్యమును కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. రైతులు అధైర్య పడకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని గిట్టుబాటు ధర పొందాలని కసిరెడ్డి, గంప సూచించారు. ఆమనగల్లు సింగిల్ విండో ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ ఆవరణలో బుధవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహ్మ, సింగల్ విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, పిఎసిఎస్ పాలకవర్గంతో కలిసి ఎమ్మెల్యే నారాయణరెడ్డి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ప్రతిరోజు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. ధాన్యం విక్రయంలో రైతులెవరూ ఆందోళన చెందవద్దని అన్నారు. విక్రయించిన ధాన్యంకు డబ్బులు రైతుల ఖాతాలో వెంటనే జమ చేస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే కసిరెడ్డి తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకేనేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, మోసపూరిత మాటలను రైతులు నమ్మి మోసపోకూడదని సూచించారు. వరి ధాన్యం క్వింటాలుకు మద్దతు ధర రూ.2369, గా ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. సన్న రకం వరి దాన్యం క్వింటాలుకు రైతులకు ప్రోత్సాహకంగా క్రింద రూ. 500 అదనంగా బోనస్‌ను రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. రైతులకు మద్దతు ధర కల్పనకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని రైతులు దర్జాగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్లి అమ్ముకోవచ్చని సూచించారు. డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సింగల్ విండోల ద్వారా వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి తక్షణం మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. రైతులను మోసగిస్తే ఎంతటి వారైనా సరే చర్యలు తప్పవని వెంకటేష్ గుప్తా హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, సింగల్ విండో డైరెక్టర్లు జోగు వీరయ్య, బెల్లి వెంకటయ్య, చేగురు వెంకటయ్య, శ్రీ పాల్, సేవ్య నాయక్, ధోల్యా నాయక్, జంగమ్మ ఎనుముల రమేష్, మార్కెట్ కమిటీ సభ్యులు వస్పుల శ్రీశైలం, సంపత్ కుమార్, కండె పాండురంగయ్య, అంజయ్య, జంగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు జగన్, గుర్రం కేశవులు, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, కాలే మల్లయ్య, మెకానిక్ బాబా, విజయ్, చలి చీమల సతీష్, కిరణ్, అప్పం శ్రీను, రూపం వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి పి. శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్ సింగల్ విండో సీఈఓ దేవేందర్, సిబ్బంది అల్లాజి, పద్మాకర్ రెడ్డి, సురేష్, మహేష్, పాల్గొన్నారు.


ఆమనగలులో డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేశ్ తో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి.

# బుగ్గ జాతరకు భక్తుల పాదయాత్ర

**-శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి దర్శనం ,365 రోజులు పూజలు నిర్వహించాలి**

**మంచాల, నవంబరు 12 ప్రభాతవార్త :** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా భావించే శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి దర్శనానికి ఇబ్రహీంపట్నం నుండి పాదయాత్రగా 11 మంది భక్తులు వచ్చారు. దక్షి ణ కాశిగా పిలవబడే బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంని కార్తీకమాసంలో పౌర్ణమి నుండి అమావాస్య వరకు మాత్రమే పూజలు నిర్వహిస్తారు. సంవత్సరంలో 15 రోజులు మాత్రమే పూజలు అందుకోవడం బాధాకరంగా ఉందని ప్రభుత్వం ,అధికారులు ,భక్తులందరూ చొరవ చేసుకొని సంవత్సరం మొత్తం దీప,దీప,నైవేద్యంతో ఆలయంలో పూజలు నిర్వహించాలని 365 రోజులు భక్తులకు స్వామివారు దర్శనం కల్పించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి సౌకర్యాలు మెరుగుపరచాలని స్వామివారి ఆశీస్సులతో రైతులు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ప్రతి సంవత్సరం లక్షకు పైగా భక్తులు వచ్చే ఈ ఆలయాన్ని ప్రభుత్వం పట్టించుకోవట్లేదని అన్నారు. ప్రత్యేక చొరవతో అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి మరింత ఆదాయం చేకూరుతుందని , పెద్ద పర్యటక ప్రాంతంగా కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల మహేందర్, సురమోని బాబు, హనుమంత సుదర్శన్, కాశమల్ల నర్సింగరావు, చెనమోని గోపాల్, పానుగంటి నరేందర్, పంది బుగ్గ రాములు, ముత్యాల సంతోష్, మారోజు యాదగిరి,చీమల కృష్ణ, పాల్గొన్నారు. పాదయాత్ర మంచాల దాటి ఆరుట్ల గ్రామ ప్రారంభంలో గల తెలంగాణ చౌరస్తా వద్ద మాజీ సర్పంచ్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు.గ్రామస్తులు మాధగోని జంగయ్య,మార సురేష్ లు పాల్గొన్నారు.పాదయాత్రగా బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని చేరుకున్న శివ భక్తులను దేవాలయ చైర్మన్,ఎండోమెంట్ ఈవో లు ఘనంగా స్వాగతించి శాలువాలతో సత్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.


రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్న భక్తులు


వెంకమ్మగూడలో రాజయ్యకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

## బరువెక్కిన గుండెకు భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే

**రాజయ్యగౌడ్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు**

**నందిగామ, నవంబరు 12 ప్రభాతవార్త :** ప్రముఖ పౌరాణిక కళాకారుడు,కాంగ్రెస్ పార్టీ పెద్దాయన కీర్తిశేషులు రాజయ్య గౌడ్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విచారం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం నందిగామ మండలం వెంకమ్మగూడ మాజీ సర్పంచ్ రజనీత వీరేందర్ గౌడ్ ఇంటికి వచ్చి ఆమె మామగారు కీర్తిశేషులు రాజయ్య గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల నేపథ్యంలో అంత్యక్రియలకు హాజరు కాలేకపోయినందుకు చింతిస్తున్నామని ఎమ్మెల్యే వాపోయారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ ఎం శివ శంకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పసుల బుచ్చయ్య, కొమ్ము కృష్ణ, సాములయ్య, గుండాల వేణుగోపాల్, ఆవుల మంద శివశంకర్, సాలయ్య, సి కృష్ణ గౌడ్ , అంతయ్య తదితరులు ఉన్నారు.

## నేటి విద్యార్థులే భవిష్యత్తు తరాలకు పునాదులు

**పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించిన పాలాది శ్రీనివాస్**

**కేశంపేట, నవంబరు 12 ప్రభాతవార్త :** నేటి విద్యార్థులే రేపటి భవిష్యత్తు తరాలకు పునాదులని బిజెపి నాయకులు పాలాది శ్రీనివాస్ అన్నారు. కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 89 మంది పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులందరికీ బోర్డ్ ఎగ్జామ్స్ పరీక్ష ఫీజు ను 13000 వేల రూపాయలను చెల్లించిన బిజెపి యువ నాయకులు పాలాది శ్రీనివాస్. గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ గ్రామస్తులు అందరిచే మన్ననలు పొందారు. ఈ సంవత్సరం పదవ తరగతి విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ విద్యార్థులు మంచిగా చదువుకోవాలని ఫీజులు చెల్లించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులుచదువుపై దృష్టి పెట్టాలని చెడు వ్యసనాల కు దూరంగా ఉండాలని విద్య పైనే పూర్తిస్థాయి దృష్టి పెట్టి చదువుకున్న పాఠశాలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్య పై ఉన్న మక్కువతో విద్యార్థులకుశ్రీనివాస్ చూపిన ఈ స్ఫూర్తిదాయకమైన సేవా కార్యక్రమం మా విద్యార్థుల హృదయాలలో ఎల్లప్పుడూ నిలుస్తుందన్నారు , శ్రీనివాస్ చేసిన మంచి పని వారికి ఒక ప్రేరణగా అవుతుందన్నారు . విద్యార్థులకు మీరు అందించిన చేయూత కు మా పాఠశాల తరఫున విద్యార్థుల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.


విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లిస్తున్న బిజెపి నాయకులు పాలాది శ్రీనివాస్

ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న శ్రీనివాస్ కు ఆ భగవంతుడి ఆశీస్సులు ఉండి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని కోరినట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఢిల్లీ బాంబు పేలుళ్ల ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

**కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లెల్ల బాల్‌రెడ్డి**

**నందిగామ, నవంబరు 12 ప్రభాతవార్త :** దేశ రాజధాని ఢిల్లీలో బాంబు పేలుళ్లకు పాల్పడిన ఉగ్రవాదులను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షి ంచాలని నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు జిల్లెల్ల బాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశద్రోహులు జరిపిన కారు బాంబు పేల్లిలో మృతి చెందడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల పట్ల సంతాపం తెలియజేస్తూ దుర్మార్గానికి పాల్పడిన దేశద్రోహులను ఉరితీయాలని కోరారు.

## శ్రీశైలంకు బస్సులు నడపండి..

**కొందుర్గు, నవంబరు12, ప్రభాతవార్త:** శ్రీశైలం పుణ్యక్షేత్ర దర్శనం కోసం వెళ్లి రావడానికి నేరుగా బస్ సౌకర్యం లేనందున అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో పరిగిడ్డిపోకు చెందిన బస్సులు వికారాబాద్ నుండి పరిగి కొందుర్గ్ షాద్నగర్ మీదుగా ప్రతీ రోజూ రెండు ట్రిప్పులు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఆర్టీసీ బస్సులు నడిపే వారిని మండల ప్రజలు తెలిపారు. దాంతో శ్రీశైల పుణ్యక్షేత్ర దర్శనం చేసుకోవటానికి ఎంతో సౌకర్యం గా ఉండేదని ప్రయాణికులు తెలిపారు . ప్రతిరోజు వికారాబాద్ నుండి శ్రీశైలం వరకు నడపడంతో ఉదయం బస్సుకు వెళ్లి సాయంత్రం బస్సుకు తిరిగి వచ్చేవారం అని పలువురు ప్రయాణికులు తెలిపారు. ఈ ప్రాంతంలో మల్లన్న స్వామిని ఎక్కువ మంది ఇంటి దేవుడిగా కొలుస్తారు. ప్రతినిత్యం కొంత మంది కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం వెళుతుంటారు. శ్రీశైలం వెళ్లాలంటే షాద్నగ జడ్చర్ల వరకు వెళ్లి అక్కడ నుండి శ్రీశైలం బస్సులో శ్రీశైలం వెళ్ళి దర్శనం చేసుకుని వస్తున్నామని ప్రయాణికులు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యం తమ ధ్యేయమని చెప్పే తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే వికారాబాద్ నుండి శ్రీశైలం వరకు ప్రతిరోజు రెండు ట్రిప్పుల బస్సులను నడపాలని మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

## రాజీయే రాజమార్గం

**పరిగి, నవంబరు12, ప్రభాతవార్త:** లోక్ ఆదావత్ సద్వినియోగం చేసుకోవాలిఅని సిఐ శ్రీనివాస్ రెడ్డి ఒ ప్రకటనలో తెలిపారు. పెండింగ్ లోని కేసులు త్వరితం పరిష్కారానికి ఈనెల 15వ తారీకు అన్ని కోర్టులలో లోక్ ఆదాలత్ నిర్వహించ బడును రాజి పడదగ్గ కేసులు సులభంగా వేగంగా పరిష్కరించుకోవడానికి మంచి అవకాశం భూ తగాదాల కేసులు అనేక రకాల కేసులు పరిష్కరించుకోవడానికి ఇది మంచి సమయం కేసుల వల్ల సమయం వృధా అవుతుంది డబ్బులు ఖర్చు అవుతాయి కావున రాజీయే రాజమార్గం అని పరిగి సిఐ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.


సిఐ శ్రీనివాస్ రెడ్డి

## ట్రాక్టర్ ఇంజన్‌లో పంచదార పోసిన గుర్తు తెలియని దుండగులు

**కేశంపేట, నవంబరు12, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో గ్రామానికి చెందిన డప్పు బాలస్వామి వ్యవసాయ పొలంలో ఆపి ఉన్న ట్రాక్టర్ ఇంజన్ లో గుర్తుతెలియని వ్యక్తులు పంచదార పోశారని రైతు బాలస్వామి తెలిపారు. తను రోజు మాదిరిగానే పనులను ముగించుకొని మంగళవారం రాత్రి తన ట్రాక్టర్ ను వ్యవసాయ పొలం దగ్గరని పెట్టి వచ్చాడు. బుధవారం ఉదయం ట్రాక్టర్ దగ్గరికి వెళ్లి ట్రాక్టర్ స్టార్ట్ చేస్తుండగా ట్రాక్టర్ ఇంజన్ స్టార్ట్ కాకపోవడంతో ఇంజన్ ని పరిశీలించి చూడగా ఇంజన్ లో పంచదార ఉన్నట్లు తెలిపారు.
ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్ లో బాధిత రైతు బాలస్వామి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.


ట్రాక్టర్ ఇంజన్‌లో పంచదార పోసిన దృశ్యం

## అందెశ్రీ మరణం తీరని లోటు

**కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో గౌరవించాలి**

**కేశమోని శ్రీనివాస్ యాదవ్**

**నందిగామ, నవంబరు 12 ప్రభాతవార్త :** సహజ కవి అందెశ్రీ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటన్ని రంగారెడ్డి జిల్లా బీసీ సేన అధ్యక్షులు కేశమోని శ్రీనివాస్ యాదవ్ (సదర్ శ్రీను) అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన చేసిన సాహితి చైతన్యం వెలకట్టలేనిది అన్నారు. తెలంగాణ ప్రభుత్వ గీత రచయిత అయిన అందెశ్రీ రచనలు, కవిత్వం ప్రజల గుండెల్లో చిరస్థాయిలో నిలిచిపోతాయని అన్నారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శం అని అన్నారు. ప్రజాకవి అందెశ్రీకి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు తో గౌరవించాలని ఆయన డిమాండ్ చేశారు.


కేశమోని శ్రీనివాస్ యాదవ్

## ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రాములు**

**దోమ, నవంబరు 12 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో గత మూడు నాలుగు సంవత్సరాల నుండి పెండింగ్‌లోఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.బుదవారం నాడు దోమ మండల పరిధిలోని గుండాల్,దిర్సంపల్లి పాఠశాలలో టిఎస్ యుటిఎఫ్‌సభ్యత్వ నమోదు కార్యక్రమములో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ అయిన ఉద్యోగులకు గ్రాటివిటి రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని,బెనిఫిట్స్‌రాక కొందరు ఇబ్బందులుపడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ప్రభుత్వాన్ని విమర్శించారు.అలాగే సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్‌లీవులు,డిఏ బకాయిలు,జిపిఎఫ్ బకాయిలు,వెంటనే విడుదల చేయాలని తెలిపారు.పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్స్ డబ్బులు విడుదల చేయాలని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామి ఇచ్చారని ఇచ్చిన హామిలను తప్పక అమలు చేయాలని కోరారు.ఒకరికోసం అందరం అందరికోసం ఒకరం అనే నినాదంతో ఏర్పాటు చేసిన ఎఫ్‌డబ్లుఎఫ్‌లో సభ్యులుగా చేరాలని అన్నారు.ఈ కార్యక్రమములో దోమ మండల అధ్యక్షులు వాసురాం,ప్రధానకార్యదర్శి జంగయ్య,జిల్లా నాయకులు రమేశ్,మేఘ్య ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గుండాల పాఠశాలలో జిల్లా కార్యదర్శి రాములు,ఉపాధ్యాయులు

## దొంగతనం కేసులో నేరస్థుడికి 9 నెలల జైలు శిక్ష

**పరిగి, నవంబరు 12 ప్రభాతవార్త :** నగదు దొంగతనం కేసులో అరెస్టు అయిన వికారాబాద్ జిల్లా, దోమమండలం, బొంపల్లి పెద్ద తాండకి చెందిన నేనావత్ గణేష్ అను వ్యక్తికి బుధవారం కోర్టులో హాజరుపరుచగా పరిగి మెజిస్ట్రేట్ నాగుల శిల్ప నేరస్థుడికి 9నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారని ఎస్ఐ మోహనకృష్ణ ప్రకటనలో తెలిపారు.. ఆగష్టు 5,2025 నాడు రాత్రి రాఘవపూర్ చౌరస్తాలో బోయిని రాములు యొక్క శ్రీరామ టిఫిన్ సెంటర్ నడుపుతున్నాడు. తన హోటల్ మూసి ఇంటికి వెళ్ళి, తిరిగి ఉదయం వచ్చి చూడగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు 11000/ రూపాయలు దొంగతనం చేశారని పరిగి పోలీస్ లకు ఫిర్యాదు చేయగా, 223/2025 గ్/బ 331 (4), 305 తీవిళీ కింద కేసు నమోదు చేసి విచారణ చేయగా... నేనావత్ గణేష్ అను వ్యక్తిని కొడంగల్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అతన్ని విచారించగా నేరాన్ని అంగీకరించాడని ఎస్ఐ తెలిపారు. రిమాండ్ కు పంపి, చార్జ్ షీట్ దాఖలు చేసి బుధవారం పరిగి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామని , అతనికి 9 నెలలు జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. ఎస్ఐ బి.మోహన్ కృష్ణ , సమీనా బేగం ఏపీపిఒ , రమేష్ హెడ్ కానిస్టేబుల్ విచారణలో కృషి చేశారు.

## ఈ బానిస బతుకులు మాకొద్దు..!

**బర్క కృష్ణపై తిరుగుబాటు**

**షాద్‌నగర్, నవంబరు 12, ప్రభాతవార్త :** సొంత జేబులోంచి డబ్బులు ఖర్చు పెట్టి బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నాము.. ఎలాంటి స్వార్థం ఆలోచించకుండా తమ కుటుంబాలను పక్కనపెట్టి సంఘం అభివృద్ధి ధ్యేయంగా


సమావేశంలో మాట్లాడుతూ బిసిసేన నాయకులు

ముందుకు కదులుతున్నాం.. కానీ సంఘంలో కొందరు తమను బానిసల్లా భావించి నియంతృత్వ పోకడలతో తమపై ఆజమాయిస్తామంటే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని బిసి సేన జిల్లా ఉపాధ్యక్షులు మేకల వెంకటేష్, నియోజకవర్గ అధ్యక్షులు కత్తి చంద్రశేఖర అప్ప, మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, మండల అధ్యక్షురాలు జక్కుల జలజ, ఉపాధ్యక్షురాలు స్రవంతి, నియోజకవర్గ యువజన అధ్యక్షులు పాలాది శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు తంగేడి పల్లి శంకర్ తదితరులు హెచ్చరించారు. బిసి సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ తీరుపై వారు తిరుగుబాటు జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో చర్చించిన అంశాలు తదితర ముఖ్య విషయాల అనంతరం మీడియాకు మేకల వెంకటేష్, కత్తి చంద్రశేఖర అప్ప స్రవంతి తదితరులు ప్రకటిస్తూ.. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను విమర్శించిన వారిపై తము కండన చేస్తే జాతీయ బిసి సెల్ అధ్యక్షులు బర్క కృష్ణ నియోజకవర్గం కమిటీ సభ్యులను కొందరిని ఉద్దేశపూర్వకంగా సస్పెండ్ చేస్తూ సోషల్ మీడియాలో వారి పేర్లను బహిర్గతం చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారని బర్క కృష్ణ తీరును ఏకంగా తప్పుపట్టారు. బిసి సేన చిన్న మూలకం నుంచి ఒక వృక్షం వరకు తీసుకువచ్చిన వాళ్ళపైనే బెదిరింపులకు దిగితే ఎలా అని ప్రశ్నించారు. అన్ని పార్టీలు నాయకులను ముఖ్యంగా బిసి నాయకులను కలుపుకొని పోవాలని వాళ్లను గౌరవించాలని ప్రతి ఒక్క బిసి నాయకుని రాజకీయ అభివృద్ధికి సహకరించాలని కానీ కొందరు ప్రజాప్రతినిధులపై చేస్తున్న వ్యక్తిగత విమర్శలు తదితర వ్యతిరేక ప్రకటనలు సరికావనీ పేర్కొన్నారు. తప్పు చేసినవారిని మందలించాల్సిన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ వారిని వెనుక వేసుకోవచ్చి తప్పు చేయని తమపై ఉద్దేశం పూర్వకమైన ప్రకటనలు చేస్తూ సంఘం నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించడం దేనికి నిదర్శనమని అన్నారు. తప్పు చేసింది ఒకరైతే శిక్ష మరొకరికి ఇచ్చేలా జాతీయ అధ్యక్షులు భరత కృష్ణ వ్యవహార శైలి స్వార్థంగా ఉందని పేర్కొన్నారు. రాత్రింబవళ్లు బిజీ సేన అభ్యున్నతికి కృషి చేశామని ఎవరో కొందరి మాటలు నమ్ముకుని మెజార్టీ శాతం సభ్యులను దూరం పెట్టుకుంటే నష్టపోయేది బర్క కృష్ణ అని వారు హెచ్చరించారు. బర్క కృష్ణ హెచ్చరికలకు తాము భయపడే ప్రసక్తే లేదని వారు ప్రకటించారు. ఈ సమావేశానికి కొంతమంది ముఖ్యులు వచ్చారని మరి కొంతమంది కూడా త్వరలోనే కలుసుకొని వారికి అన్ని విషయాలు వివరిస్తామని బిసి సేన సంఘంలో ఏం జరుగుతుంది ఏం జరగబోతుంది సంఘాన్ని ఎలా కాపాడుకోవాలో తమకు కూడా తెలుసని తాము బీసీ బిడ్డలమని బీసీ నినాదంతో సింహాలై గర్జించి బడుగు బలహీన వర్గ ప్రజలను కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

## ఎంపిడిఒ గా బాధ్యతలు చేపట్టిన సృజన

**మోమిన్‌పేట్, నవంబరు 12, ప్రభాతవార్త :** మోమిన్ పేట మండల నూతన ఎంపిడిఓ గా బాధ్యతలు చేపట్టిన సృజన సాహితిని ఎంపిడిఓ కార్యాలయంలో మండల ఉపాధి హామీ క్షేత్ర స్థహాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షులు సోమారపు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అడివిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పోచయ్య, కోశాధికారి హ నుమంతు, చంద్రశేఖర్, నాగేందర్, జగన్నాథం, బుచ్చయ్య, దేవదాసు, అశోక్, చందర్, లక్ష్మణ్, మల్లేశం, బుజెందర్, నర్సింలు, మండల ఈజిఎస్ ఏపిఓ శంకర్ గౌడ్, ఎంపిఓ యాదగిరి, ఈసీ వికాస్,టీఏలు భగవాన్, ఎల్లయ్య, గంగయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మండల ఈజీఎస్ సిబ్బందికి ధన్యవాదములు తెలిపారు.


ఎంపీడీఓను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

# పేదోడి కలల సాకారం ఇందిరమ్మ ఇళ్ళు

**-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, నవంబరు12, ప్రభాతవార్త:** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ స్కీంల పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తుందని కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కారు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ళు పథకం ఎంతోమంది పేదల సొంతింటి కలను సాకారం చేస్తుందని కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతిఒక్కరికి సొంతింటి కలను సాకారం చేయాలనే ఆశయంతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ళ పథకం ప్రవేశపెట్టారని ప్రభుత్వ ఆశయానుకనుగుణంగానే రాష్ట్రంలో ఇళ్ళ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని కొనియాడారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమపాలలో సమర్థవంతంగా ముందుకు సాగుతున్నాయని, అనేక సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఆమనగల్లు మండలంకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళ పథకం లబ్దిదారులకు బుధవారం పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డేన్స్ ఫంక్షన్ హాలులో ప్రొసిడింగ్‌లు అందజేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని పట్టణాలతోపాటు పల్లె గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ళు ఏకధాటిగా నిర్మాణం జరుపుకుంటున్నాయన్నారు. నిబంధనలు అనుసరించి నిర్మించుకుంటున్న


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఇందిరమ్మ ఇళ్ళు లబ్దిదారులకు ప్రతి సోమవారం బిల్లుల చెల్లింపులను అవరోధం లేకుండా చెల్లిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం అనేక ఇండ్లు వందశాతం నిర్మాణాలు జరుపుకున్నాయని, వారికి ప్రభుత్వం సూచించిన విధంగా సకాలంలో బిల్లులు అందుతున్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ళు మంజూరైన వారు అలసత్వం చేయకుండా వేగవంతంగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. అనంతరం షాదిముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను కూడా ఎమ్మెల్యే లబ్దిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు మున్సిపాలిటి కమిషనర్ శంకర్‌నాయక్, ఎంపిడిఓ కుసుమ మాధురి, మార్కెట్ కమిటి చైర్మన్ యాటగీతనర్సింహ్మ, టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ


లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ళ ప్రొసిడింగ్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

జడ్పీటిసి శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గూడూరు శ్రీనివాసరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ సభ్యులు వస్పుల శ్రీశైలం, సంపత్ కుమార్, కండె పాండురంగయ్య, అంజయ్య, జంగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు తెల్గమళ్ళ జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, సీనియర్ నాయకులు గుర్రం కేశవులు, మండ్లి రాములు, కాలే మల్లయ్య, మెకానిక్ బాబా, విజయ్, విజయ్‌రాథోడ్,ఎంగలి ప్రసాద్, ఖాదర్, కిరణ్, అప్పం శ్రీను, ఫరీద్, వస్పుల శ్రీకాంత్, గుండ్రాతి కుమార్‌గౌడ్, అలీమ్, రూపం వెంకటరెడ్డి, అవ్వారి శివలింగం,మల్లేశ్‌నాయక్, కండెసాయి, వాటర్‌బాబ, తదితరులు ఉన్నారు.

## అనంత పద్మనాభ స్వామిని దర్శించుకున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్, నవంబరు12, ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధిలోని అనంతగిరి శ్రీ అనంత పద్మనాభ స్వామి వారిని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ బుధవారం దర్శించుకున్నారు. ఆయన రాకను పురస్కరించుకుని ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్ స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్‌కు ఆశీర్వచనం చేసి జ్ఞాపికను బహుకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, డీఆర్ఓ మంగీలాల్, ఆర్‌డీఓ వాసు చంద్ర, డీపీఆర్ఓ చెన్నమ్మ, తహసిల్దార్ లక్ష్మీనారాయణ , ఆలయ ఇఓ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి దర్శనం అనంతరం కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ ఈఓ నరేందర్

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

**మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్**

**కొడంగల్, నవంబరు12, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మున్సి పల్ కమీషనర్ బలరాంనాయక్ అన్నారు.బుధవారం కొడంగల్ పట్టణం లోని జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తు న్న మధ్యాహ్న భోజనాన్ని మున్సిపల్ కమీషన్ పరిశీలించారు .విద్యా ర్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు.మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన బియ్యం,కూరగాయలతో వడ్డించాలని వంట ఏజన్సీ నిర్వహ కులకు సూచించారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమీషనర్

## దొంగతనం కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

**...ఎస్ఐ వేణుకుమార్**


పోలీసుల అదుపులో నిందితులు

**పెద్దేముల్, నవంబరు 12, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండల కేంద్రం లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో, మండల వనరుల కేంద్రంలో(యంఆర్‌సి) జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు నింది తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వేణుకుమార్ తెలిపారు.ఈసందర్భంగా ఎస్ఐ వేణుకుమార్ మాట్లాడుతూ పెద్దేముల్ గ్రామానికి చెందిన గౌడి శివకుమార్, బంటారం మండలం సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన సమకొల్ల నాగరాజులు ఈ నెల 2వ తేది అర్ధరాత్రి 2 గంటల సమయంలోశ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలోని హుండిలో గల డబ్బులు సుమారు రూ.7600, రెండు నెలల క్రితం యంఈఓ కార్యాలయంలో ల్యాప్‌టాప్‌ను దొంగతనం చేసారని అన్నారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న వారు బుధవారం పెద్దేముల్ మండల కేంద్రం లోని కనకదుర్గ వైన్స్ సమీపంలో అనుమానస్పదంగా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరము ఒప్పుకున్నారని అన్నారు. ల్యాప్‌టాప్‌ను శివ ఒక్కడే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని అన్నారు.ఈ రెండు కేసులలో వారి వద్ద నుంచి రూ. 8110లను స్వాదీనం చేసుకున్నామని, వారిని కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అన్నపై గొడ్డలితో దాడిచేసిన వ్యక్తి జ్యుడిషియల్ కస్టడీ

**మొయినాబాద్, నవంబరు12, ప్రభాతవార్త:** సొంత అన్నను గొడ్డలితో విచక్షణ రహితంగా దాడిచేసి గాయపరిచిన సంఘటన మొయినాబాద్ పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది, తేది 10.11.2025 న చింతల పాపయ్య పెద్దమంగళారం గ్రామ నివాసి ఇచ్చిన పిర్యాదు ప్రకారం పోలీసులు తెలిపిన వివరాలు పిర్యాదు ప్రకారం తన ఫిర్యాదు ప్రకారం తన చిన్న కుమారుడు చింతల మల్లేష్ అలియాస్ పండు (18) తన పెద్ద కుమారుడు చింతల వెంకటేష్ (23) పై గొడ్డలితో దాడిచేసినట్లు తెలిపారు, ఈ సంఘటనపై మొయినాబాద్ పోలీసు అధికారులు కేసు నమోదు చేసి దార్యాప్తు చేపట్టారు, దర్యాప్తులో భాగంగా నిందితుడు చింతల మల్లేష్ అలియాస్ పండును పట్టుకొని విచారణ జరిపారు, విచారణ అనంతరం తేది 12.11.2025 నాడు బుధవారం నిందితుడిని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుచేయగా ఆయన ఆదేశాల మేరకు నిందితుడిని జూడిషియల్ కస్టడీకి పంపించడం జరిగినట్లు తెలిపారు,

## జర్నలిస్టుల స్వేచ్ఛను హరిస్తే సహించం

**షాద్‌నగర్, నవంబరు12, ప్రభాతవార్త:** జర్నలిస్టుల స్వేచ్ఛను హరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీనియర్ జర్నలిస్టు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా సహాయ కార్యదర్శి లక్కాకుల రమేష్ కుమార్ అన్నారు. బుధవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా స్థాయి విస్తృత సమావేశం శంకర్పల్లి వద్ద జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి పదవిని ప్రకటించిన అనంతరం ఆయనకు సన్మానం చేశారు. ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు నిత్యం సమాజ సేవలో నిమగ్నమై ఉంటారని, ఈ క్రమంలో వారిపై దాడులు, దౌర్జన్యాలు సర్వ సాధారణంగా మారాయని అన్నారు. ఇకపై భవిష్యత్తులో వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. రమేష్ కుమార్ లాంటి సీనియర్ జర్నలిస్టులు వర్తమాన జర్నలిస్టులకు ఆదర్శంగా నిలిచి సమాజంపై ఎలా పోరాడాలో నేర్పించాలని ఈ సందర్భంగా సంఘాల నాయకులు స్పష్టం చేశారు.

## సోదరుడిలా వచ్చాడు..సొంతింటిని ఇచ్చాడు..

**లబ్దిదారు కూతురు శిరీష భావోద్వేగం..**


ఇందిరమ్మ ఇంటికి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్


గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే

**షాద్‌నగర్, నవంబరు 12, ప్రభాతవార్త:** ఒక చిన్న గుడిసె ఉంటే చాలనుకున్నాం..అలాంటిది ఒక ఇంటికే యజమానిని చేశాడు..ఇందిరమ్మ ఇంటి ద్వారా మా స్వప్నాలను సాకారం చేశాడు.. మా శంకరన్నను మరువలేం.. ఆయన చేసిన మేలును ఎప్పటికీ మరచి పోలేం.. అంటూ భావోద్వేగానికి గురైంది బాలిక శిరీష. ఎమ్మెల్యే తో తన ఆవేదనను పంచుకుంది. విషయం ఏమిటంటే షాద్ నగర్ నియోజక వర్గం ఫరూక్ నగర్ మండలం పుచ్చర్లకుంట తాండ పరిధిలోని కరణం కుంట తండా గ్రామానికి చెందిన ఓ గిరిజన జంటకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయింది. ఈ ఇంటి నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ ఇంటి గృహప్రవేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కూతురు శిరీష తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తమ అమ్మా నాన్నకు ఒక ఇల్లు ఉంటే చాలు అని కలగన్నామని, ఆ కలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూర్తి చేశారని, దీనికి ఎప్పటికీ రుణపడి ఉంటామని ఆమె కన్నీటి పర్యంతమై తన కృతజ్ఞత తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వం ఉన్నది పేదవాళ్లకోసమేనని, వారికి సేవ చేయడం తమ ముందున్న బాధ్యత అని వివరించారు. అంతేకాకుండా బాలికతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో నృత్యం చేసి ఆయన అలరించారు. అనంతరం లబ్ధిదారులు కవిత, మోహన్ దంపతులతో కలిసి ఆయన సన్నబియ్యంతో భోజనం చేశారు. నిరుపేదల కోసం కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం, ఇలాంటి మంచి కార్యక్రమంలో తాను భాగస్వామిని కావడం ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

## హస్నాబాద్‌లో తీరిన లోవోల్టేజీ సమస్య

**దుద్యాల్, నవంబరు12, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలోని తెలుగు వాడకు లోవోల్టేజీ విద్యుత్ సమస్యతీరినట్లే అని లైన్మెన్ వెంకట్ రాములు పేర్కొన్నారు. కాలనీలో గత నెల రోజుల క్రితం నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను బుధవారం వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగువాడలో గత కొన్ని సంవత్సరాలుగా లోవోల్టేజీ కారణంగా విద్యుత్ సమస్య ఏర్పడేదని, విద్యుత్ సమస్య సైతం కల్గేదన్నారు. కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్య ను అధికారులకు విన్నపించడం జరిగిందన్నారు. అధికారులు కూడ పరిశీలించి నూతన ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కొన్ని కారణాల వల్ల ఇన్నాళ్లు సరఫరా కనెక్షన్ ఇవ్వలేదని, నేటి నుండి సరఫరా ను ప్రారంభించినట్లు తెలిపారు. శాశ్వతంగా లోవోల్టేజీ సమస్య తీరడంతో కాలనీ వాసులు సైతం ఆనందం


ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిన దృశ్యం

## జర్నలిస్టుల సంక్షేమమే టిడబ్ల్యూజేఎఫ్ ధ్యేయం

**శంకర్‌పల్లి, నవంబరు 12, ప్రభాతవార్త:** జర్నలిస్టుల సంక్షేమమే టిడబ్ల్యూజేఎఫ్ ధ్యేయం అని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేరిబాయి గణేష్, మైల సైదులు అన్నారు. బుధవారం చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని శంకర్‌పల్లి మండల కేంద్రంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా మూడవ మహాసభలో తీసుకున్న తీర్మానాలను జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ప్రధాన ఎజెండా అంశాలుగా చేర్చుకొని సుదీర్ఘంగా వాటిపై చర్చించారు. మహాసభ తీర్మానాలపై జర్నలిస్టులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వర్కింగ్ జర్నలిస్టుగా పని చేస్తున్న వారికి దక్కాల్సిన అక్రిడేషన్ కార్డులు పక్కదారి పట్టకుండా పకడ్బందీగా వ్యవహరించాలని తెలిపారు. జర్నలిస్టులకు ఎలాంటి ఆపద ఉన్న సరైన సమయంలో స్పందించి యూనియన్ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల పిల్లలకు రాయితీతో కూడిన విద్య అందించేందుకు మరింతగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ముఖ్యంగా ఎంతో కాలంగా పెండింగ్లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు సమస్యలను పరిష్కరించే దిశగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ప్రత్యేక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం 43 మందితో జిల్లా పూర్తి స్థాయి కమిటీని జిల్లా కార్యదర్శి మైల సైదులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం కోశాధికారి శ్రీనివాస్ చారి, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, రాజశేఖర్, ఈసీ మెంబర్ శ్రీధర్, చేవెళ్ల డివిజన్ అధ్యక్షులు సిహెచ్ రాజు, ప్రధాన కార్యదర్శి జై చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు ఉన్నారు.

# విద్యార్థులకు దంత పరీక్షలు


వైద్య నిపుణులు డాక్టర్ వినోద్ దృశ్యం


దంత పరీక్షల కోసం విచ్చేసిన జడ్పీహెచ్ఎస్ నేరెడ్‌మెట్ విద్యార్థుల దృశ్యం


దంత పరీక్షలు చేసుకున్న విద్యార్థులతో దంత వైద్య నిపుణులు డాక్టర్ వినోద్, సిబ్బంది, ఉపాధ్యాయుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 12, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దంత పరీక్షలు, ఈఎన్‌టి వైద్య పరీక్షలు దంత వైద్య నిపుణులు డాక్టర్ వినోద్ నిర్వహించారు. బుధవారం మేడ్చల్ జిల్లా పరిధిలోని మల్కాజ్‌గిరి పిహెచ్‌సిలో జడ్పీహెచ్ఎస్ నేరెడ్‌మెట్ పాఠశాల విద్యార్థులు 35మందికి స్క్రీనింగ్ చేయగా, వీరిలో 26మంది విద్యార్థులకు పాడైన దంతాల (డికేడ్‌టూత్) సమస్యలను గుర్తించినట్లు, వీరికి ఫిల్లింగ్స్, ఎక్స్ట్రాక్షన్‌లు వంటి చికిత్సలు అడ్వాన్స్‌డ్ డెంటల్ కేర్ యూనిట్‌లో దంత వైద్య నిపుణులు డాక్టర్ వినోద్ దంత పరీక్షలను నిర్వహించారు. అదే విధంగ ఎంహెచ్‌టి-1నుంచి వచ్చిన 4మంది ఆర్‌బిఎస్‌కె విద్యార్థులు దంత చికిత్సల కోసం పిహెచ్‌సి మల్కాజ్‌గిరిలో రెఫరల్ ఆధారంగ చికిత్సలు పొందినట్లు తెలిపారు. ఒక పిహెచ్‌సి పరిధిలో ఇలాంటి అరుదైన సేవలు అందించటం ప్రశంసనీయమని స్థానిక పలువురు ప్రజాప్రతినిధులు డాక్టర్ వినోద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోద్‌తో పాటు దంత వైద్య నిపుణులు, ఆర్‌బిఎస్‌కె డాక్టర్స్, పిహెచ్‌సి సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అయితే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దంత పరీక్షలు ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో నిర్వహించటం ప్రత్యేకతను చాటుకుందని చెప్పవచ్చు.

విద్యార్థులు దంత సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి ఆరోగ్య పరంగా సేవలు అందిస్తూ దంత పరీక్షలు చేసి దంత సమస్యలను పరిష్కరించటం ప్రశంసనీయం. ఆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దంత వైద్య నిపుణులు డాక్టర్ వినోద్ చికిత్సలు చేయటం పేద విద్యార్థులకు సేవలు అందటం ఆ విద్యార్థుల్లో సంతోషం వ్యక్తం అయింది. దంత పరీక్షలు చేసిన ఆ దంత వైద్యులు డాక్టర్ వినోద్ అందరిని మన్ననలను పొందుతున్నారు. ప్రభుత్వ దంత వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పేద విద్యార్థులకు దంత పరీక్షలు చేసి బాగు చేయటం మరింత ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చెప్పవచ్చు. అయితే జిల్లా వ్యాప్తంగా కూడ దంత సమస్యలు ఉన్న వారు ప్రజలు వెళ్లినా మల్కాజ్‌గిరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో దంత పరీక్షలు చేస్తూ డాక్టర్ వినోద్ సేవలు అందిస్తున్నారు.